ఓంకారేశ్వరాలయంలో రథోత్సవం

కోహీర్, మార్చి 9: కోహీర్(ఓంకార పట్టణం)లోని ఓంకారేశ్వరాలయంలో శనివారం మహాశివరాత్రి వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. డాక్టర్ ప్రతాప దక్షిణామూర్తి దీక్షితుల ఆధ్వర్యంలో రథోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు.

వేడుకల్లో భాగంగా రుద్రస్వాహాకారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓంకారేశ్వరాలయంలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డి, నేతలు

ఎల్‌వోసీ అందజేత

పటాన్‌చెరు, మార్చి 9: సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రూ.50వేల ఎల్‌వోసీని అందజేశారు. శనివారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు ఎల్‌వోసీని అందించారు. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

తునికిలతండాలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

కంది, మార్చి 9: మండలంలోని తునికిలతండాలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. బంజారా ఎంప్లాయిస్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బాబాసాహెబ్ కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైకోర్టు న్యాయవాది కదిరే కృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, హైకోర్టు న్యాయవాది ముఖీమ్, మాజీ జడ్పీటీసీ రాజురాథోడ్, ప్రకాశ్‌రాథోడ్, ప్రేమానందం, జైపాల్‌నాయక్, ఫూల్‌సింగ్, మల్లికార్జున్, మారుతి, దుర్గప్రసాద్ దుర్గయ్య, రాజు పాల్గొన్నారు.

తునికిలతండాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీఎమ్మెల్సీ రాములు నాయక్

ఊట్లలో రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు

జిన్నారం, మార్చి 9: మండలంలోని ఊట్ల గ్రామంలో మల్లన్న, లక్ష్మీనరసింహస్వామి, రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం అగ్నిగుండాలు, బండ్లఊరేగింపు, బోనాలు జరిగాయి. ఉత్సవాలను వీక్షించేందు కు సోలక్‌పల్లి, రాళ్లకత్వ, మంగంపేట, రొయ్యపల్లి, జిన్నారం, కొడకంచి, ఇమామ్‌నగర్ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, శివరాజ్, వెంకట్రాంరెడ్డి, గోవిందరాజు, శెట్టి శివరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, రవీందర్, ప్రభాకర్‌రెడ్డి జాతరలో పాల్గొని మల్లన్న, రేణుకా ఎల్లమ్మను దర్శించుకొని పూజలు చేశారు. అగ్నిగండాలను వీక్షించేందుకు నాయకులు, భక్తులు అగ్నిగుండం చుట్టూ కిక్కిరిశారు. జాతరకు హాజరైన నాయకులను యాదవసంఘం సభ్యులు సన్మానించారు. లక్ష్మీనరసింహస్వామి చిత్రపటంతో భక్తులు మల్లన్న గుట్ట వరకు పల్లకీసేవ నిర్వహించారు.

ఊట్ల మల్లన్న జాతరలో అగ్నిగుండాలు తొక్కుతున్న భక్తులు

గ్రామాలకు సీసీ రోడ్లతో మహర్దశ

చౌటకూర్, మార్చి 9: సీసీ రోడ్లతో గ్రామాలకు మహర్దశ రానున్నదని, మంత్రి దామోదర రాజనరసింహ కృషితో అభివృద్ధి వేగవంతమవుతుందని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నత్తిదశరత్ అన్నారు. శనివారం చౌటకూర్, పోసానిపల్లి గ్రామాల్లో రూ.30లక్షలతో సీసీరోడ్డు పనులకు ప్రారంభించారు. చౌటకూర్ గ్రామాభివృద్ధికి ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.25 లక్షలు, పోసానిపల్లి అభివృద్ధికి రూ. 5లక్షలను మంత్రి దామోదర రాజనర్సింహ మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్కల రమేశ్, మాజీ ఉపసర్పంచ్ కలాలి రామాగౌడ్, మల్లారెడ్డి, కలాలి ఈశ్వర్‌గౌడ్, సాన గోవర్ధన్‌ముదిరాజ్, అబేద్, శంకర్, షరీఫ్, కృష్ణ పాల్గొన్నారు.

చౌటకూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- వట్‌పల్లి మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- వెంకట్‌ఖ్వాజా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

వట్‌పల్లి, మార్చి 9: మండలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం వట్‌పల్లి మండలంలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పల్వట్లలో రూ.2.60 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, గొతాపూర్ నుంచి గొర్రెకల్ వరకు రూ.1.30 కోట్లతో మెటల్ రోడ్డు నిర్మాణం, వట్‌పల్లిలో రూ. 11.20 కోట్లతో 30 పడకల దవాఖాన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఎన్నికల హామీలో భాగంగా వట్‌పల్లిలో ప్రభుత్వ దవాఖానను ఏర్పాటు చేస్తున్నామని, మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. అనంతరం వెంకట్‌ఖ్వాజా దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంసీ సురేశ్‌షెట్కార్, ఎంపీపీ కృష్ణవేణీ, జడ్పీటీసీ అపర్ణ, కోఆప్షన్ సభ్యుడు కుతుబొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, సంగమేశ్వర్, శ్రీశైలం, శివశరణ్, వినయ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, సంగారెడ్డి. దిగంబర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, గోపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

30పడకల దవాఖాన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

కల్యాణం.. కమనీయం

కోహీర్, మార్చి 9: మండలంలోని కవేలి గ్రామ శివారులోని గుట్టపై వెలిసిన గిరిజా సమేత మహాలింగ సంగమేశ్వరాలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయావరణలో ఏర్పాటు చేసిన మండపంలో పార్వతీపరమేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తుల కల్యాణాన్ని సంప్రదాయం ప్రకారంగా నిర్వహించారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల పాదాలపై అక్షింతలు వేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, రాములు, మాజీ సర్పంచులు జగదీశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్, నాగరాజు, రాజేందర్, శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి, రాజు, మురళి పాల్గొన్నారు.



కోహీర్ : కవేలి సంగమేశ్వరాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

బొల్లారం మార్చి 9: మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్‌కాలనీ భవానీశంకర ఆలయంలో పార్వతీపరమేశ్వరుల శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోలన్ బాల్‌రెడ్డిదంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా, మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్‌రెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు అందించారు. ఆలయ అర్చకుడు నాగార్జునాచార్యులు వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని మహిళాభక్తులు అధిక సంఖ్యలో తిలకించి, దర్శించుకున్నారు.

వైభవంగా మల్లికార్జునుడి కల్యాణం

అమీన్‌పూర్, మార్చి 9: బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బైసా సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి దంపతులతోపాటు స్థానికులు కల్యాణంలో కూర్చున్నారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామి కమిటీ తరపున ఎమ్మెల్యే సతీమణి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశిధర్, ఎమ్మెల్యేతోపాటు కుటంబ సభ్యులు, వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్లు బాసెట్టి కృష్ణ, కాట సుధారాణి, కొల్లూరి మల్లేశ్, లావణ్యాశశిధర్‌రెడ్డి, మున్నా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధేశ్వర స్వామి కల్యాణం

జహీరాబాద్, మార్చి 9: జహీరాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

భక్త జన సంద్రంగా శివాలయాలు

మనూరు, మార్చి 9: మండల పరిధిలోని శివాలయాలు శుక్రవారం రాత్రి భక్తులతో సందడిగా మారాయి. మండలంలోని బోరం చ, బాదల్‌గావ్ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచలింగేశ్వర ఆలయంలో అధికసంఖ్యలో పాల్గొని అభిషేకం చేశారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అమీన్‌పూర్ : స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ బైస సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

బొల్లారం : ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని జరిపిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి దంపతులు

జహీరాబాద్ : పట్టణంలోని సిద్ధేశ్వరాలయంలో కల్యాణానికి హాజరైన ప్రజలు

సల్లంగా ఉండాలి

సదాశివపేట, మార్చి 9: పరమేశ్వరుడి కృపతో ప్రజలు సల్లంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్ వేడుకున్నారు. శుక్రవారం రాత్రి సంగమేశ్వరాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. మాడుగుల సర్వోత్తమ శర్మ ఆధ్వర్యంలో కౌన్సిలర్ శివకుమార్, మంజుల దంపతులు, శ్రీనివాస్ రాజేశ్వరి దంపతులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చింతా సాయినాథ్, ఆలయ కమిటీ సభ్యులు మోహన్‌రావు, శంకర్‌రావు, నారాయణరావు, మల్లికార్జున, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యను అందిపుచ్చుకోవాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 9: క్రమశిక్షణతో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సలోమాన్‌రెడ్డి పదోతరగతి విద్యార్థులకు సూచించారు. శనివారం శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జీవితం మన చేతుల్లోనే ఉంటుందని, పాఠశాల విద్య పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ హెడ్ జయబాలరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, కృష్ణచైతన్య రెడ్డి, వంశీకృష్ణ రెడ్డి, డాక్టర్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సలోమాన్‌రెడ్డి

నీళ్లు వదలాలి

- నల్లవాగు నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలి
- పెట్టుబడి పెట్టి నష్టపోతున్న రైతులు
- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఇందిరనగర్‌లో ఎండిన జొన్నపంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్వర్ట్, మార్చి 9: నల్లవాగు ప్రాజెక్టు నీళ్లు వదిలి చేతికొచ్చిన పంటలను కాపాడి, రైతులను ఆదుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. శనివారం నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కుడి కాలువ కింద ఫత్తేపూర్, మార్డి, ఇందిరనగర్, ఖానాపూర్ కే, కృష్ణాపూర్ గ్రామాల్లో నీరందక ఎండుతున్న జొన్నపంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సాగు చేసిన జొన్నపంట చేతికొచ్చిందని, ఒకతడి పారితే రైతులు గట్టెక్కుతారన్నారు. ఫత్తేపూర్ గ్రామానికి చెందిన రైతు అఖిల్ 12 ఎకరాలు కౌలుకు తీసుకొని జొన్నపంట సాగుచేయగా నాలుగు ఎకరాలు బోరునీటితో పారుతుందని, మిగతా ఎనిమిది ఎకరాలు నీరందక ఎండిపోతుందని చెప్పడంతో చలించిపోయానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో యాసంగిలో పంటలు ఎండలేదని ఇందిరనగర్ రైతు చెప్పారన్నారు.

నాలుగు రోజుల కింద కలెక్టర్‌ను కలిసి ఎండుతున్న పంటల గురించి వివరించి పంటకు నీరందించాలని కోరామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో క్రాఫ్ హాలిడే ప్రకటించినప్పటికీ పంటలు ఎండుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు నీరు వదిలామని మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చెప్పారు. ప్రాజెక్టులో పంటకు రెండు తడులు అందించేంత నీరు నల్లవాగు ప్రాజెక్టులో ఉన్నదన్నారు. పది రోజులు కాలువల మరమ్మతు పనులు నిలిపినా నష్టం లేదని, పంటకు నీరందకపోతే వేల ఎకరాల్లో పంట ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉన్నదని చెప్పారు. రాజకీయాలు పక్కనబెట్టి రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ఎడమ కాలువ కింద నిర్దేశించిన ఆయకట్టు కంటే ఆదనపు ఆయకట్టుకు నీరందిస్తున్నారన్నారు.

రైతుల పంట ఎండిపోతే ప్రభుత్వమే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటను పరిశీలించేందుకు వెళ్లగా పంటకు నీరందించేలా కృషి చేయాలని ఇందిరానగర్, ఫత్తేపూర్ రైతులు ఆవేదనతో వేడుకున్నారని చెప్పారు. ఎండుతున్న పంటల దుస్థితిని కలెక్టర్‌కు మరోసారి విన్నవిస్తానని రైతులతో ఆయన చెప్పారు. అనంతరం ఇందిరనగర్‌లోని దుర్గమాత ఆలయానికెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంసింగ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అలీ, కల్వర్ట్ ఎంపీటీసీ సంగప్ప, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు జనార్దన్ సార్, దాడే పండరీ, శ్రీనివాస్‌గౌడ్, రాములు నాయక్, బాలయ్య, సాయిగొండ ఉన్నారు.

కేతకీలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఝరాసంగం, మార్చి 9 : కేతకీ సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు అమ్మవారికి విశేష కుంకుమార్చన, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. యాగశాలలో రుద్రస్వాహకార హోమం, నవగ్రహ శాంతి హోమం, అగ్నిగుండ పూజ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం ఉత్సవమూర్తులను నంది వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు చెందిన భక్తుడు మైలారే మహేశ్ కుటుంబసభ్యులు 500 గ్రాముల వెండిని స్వామివారికి అందజేశారు. దాతలను ఆలయ అధికారులు, అర్చకులు పూలమాల, శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, మాజీ ఎంపీపీ హన్మంత్‌రావు పాటిల్, నాగేందర్ పటేల్, సంతోశ్‌పాటిల్, మల్లయ్య స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నందివాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

రైతులను ఆదుకోవాలి

కల్వర్ట్, మార్చి 9: నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని జడ్పీటీసీ నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలపరిధిలోని ఖానాపూర్‌కే గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక్క తడి నీరు అందించి ఎండుతున్న పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి నీరందించాలని వినతిపత్రం అందించామన్నారు. పంటలను కాపాడటానికి రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రాజకీయం కోసం రైతులను నష్టపర్చడం సరికాదన్నారు. నల్లవాగు ప్రాజెక్టులో నీళ్లు ఉన్నాయనే ఆశతో రైతులు సాగు చేశారని, పంట కోసం నీరందించేందుకు ఎమ్మెల్యే సంజీవ రెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్, మండల అధ్యక్షుడు రాంసింగ్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు అలీ, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బీబీపేట్ పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్థివ దేహానికి నివాళి

ఝరాసంగం, మార్చి 9 : మండలంలోని మచ్నూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నుల్క కిష్టయ్య అనారోగ్యంతో మరణించారు. శనివారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మృతుడి నివాసానికెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం ఉన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

పల్లెల అభివృద్ధే ధ్యేయం

న్యాల్‌కల్, మార్చి 9: పల్లెల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని హద్నూర్ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పేర్కొన్నారు. శనివారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు సామల రాచన్న, షకీల్, మధుసూదన్, సంగారెడ్డి, మాణిక్‌రెడ్డి, మల్లన్న, నర్సింహారెడ్డి, సాయికిరణ్‌గౌడ్, శ్రీశైలం, మునీరొద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

న్యాల్‌కల్, మార్చి 8: మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది కేక్ కట్ చేశారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లనకు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నృపేన్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

మునిపల్లి, మార్చి 9 : బుసారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇబ్రహీం సాబ్, మొగులాన్ సాబ్ సమక్షంలో గ్రామస్తులు ఘనంగా గంధం ఊరేగించారు. శనివారం బుసారెడ్డిపల్లి నుంచి వట్‌పల్లిలోని సద్దురు వెంకటఖ్వాజా దర్గాకు భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య అంగరంగ వైభవంగా గంధం ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు నీళ్లతో సాకపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

హత్నూర, మార్చి 9 : మండలంలోని సాదుల్లానగర్, గుండ్లమాచునూర్ గ్రామాల్లో జరిగిన శివరాత్రి మహోత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కాగా హత్నూరలో శివపార్వతుల కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు.

భ్రమరాంభమల్లికార్జునస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

సంగారెడ్డి, మార్చి 9: యువకులు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు వస్తాయని, శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలో ప్రీమియర్ లీగ్ సీజన-4 క్రికెట్ టోర్నమెంటును ఇన్‌స్పెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం 12వ వార్డు కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్న శంకర్‌రెడ్డి, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురాతన శిల్పాలు పరిశీలన

అందోల్, మార్చి 9: అందోల్ పెద్దచెరువు సమీపంలోని నాగులకట్ట వద్దనున్న పురాతన శిల్పాలను శనివారం పురావస్తు పరిశోధకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా పురావస్తు శాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి మాట్లాడుతూ నాగులకట్ట వద్దనున్న శిల్పా లు వెయ్యేండ్ల నాటివని, చాళుక్య, కాకతీయుల కాలం నాటి శిల్పాలన్నారు. ఈ విషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లామన్నారు. చారిత్రక శిల్పా ల్లో చెన్నకేశవ విగ్రహం, శ్రీదేవి, భూదేవి, దశావతార శిల్పాలున్నట్లు తెలిపారు.

ఇబ్బందులు పరిష్కరించండి

సిర్గాపూర్, మార్చి 9: మండలంలోని ఉజలంపాడ్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలని భారత జాగృతి జిల్లా యువ విభాగం అధ్యక్షుడు అరుణ్‌రాజ్, స్థానికులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం గుత్తేదారు మిషన్ భగీరథ పైపులైన్ చూసుకోకుండా పగులగొట్టారన్నారు.

దీంతో నీటి సరఫరా నిలిచిపోయి మూడు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శిని అడగ్గా సదరు కాంట్రాక్టర్‌తో పైపులైన్ మరమ్మతులు చేయిస్తామని, అప్పటివరకు ట్యాంకు ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పారు.